# ప్రాణం ఖరీదు రెండువందలా?

**1977** జులై నాలుగవ తేదీన అడిషనల్ సెషన్స్ జడ్జి శ్రీ ఎమ్. మిత్ర కోర్టులో జనం కిటకిట లాడుతున్నారు. అందరి ముఖాల్లో విచారం, కొంత కుతూహలం కన్పిస్తున్నాయి.

ఆనాడు ప్రజలలో విశేష సంచలనం కలిగించిన డాక్టర్ బి. ఎం. బెనర్జీ కేసు విచారణ జరుగుతోంది. హౌరా కోర్టు గవర్నమెంట్ ప్లీడరు దత్తా వాదనను ప్రతిఘటించడానికి ప్రసిద్ధ క్రిమినల్ లాయర్ సనాతనముఖర్జీ హాజరయ్యాడు. జడ్జి ఆదేశం మేరకు కేసులో ముద్దాయిలైన డాక్టర్ బెనర్జీ, శాంతి రంజన్ డే లను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ న్యాయవాది దత్తా న్యాయమూర్తిని సంబోధించాడు-

"యువరానర్! మీ ముందున్న ఈ ముద్దాయిల అభియోగం చాలా భయంకరమైనది. జుగుప్సాకరమైనది కూడా! ఇతను శాంతి రంజన్ డే స్నేహం పేరుతో, బాంధవ్యం మునుగులో ఎంత ఘోరం చేశాడో ఈ కేసులో స్పష్టంగా తెలిసిన విషయం." దత్తా ఓ క్షణం ఆగి బెనర్జీని చూపుతూ, "సార్! ఇతను ఒక డాక్టరు. భగవంతుడిలా దయతో ప్రవర్తించవలసిన పవిత్ర బాధ్యతవున్న వృత్తి ఇతనిది. కానీ ఇతను నరరూప రాక్షసుడిలా 15 సంవత్సరాల అమాయిక బాలిక జీవితాన్ని బలితీసుకున్నాడు. ఎందుకు? కేవలం రెండువందల రూపాయల కోసం! ఒకమనిషి ఖరీదు ఈ డాక్టరు దృష్టిలో 2 వందల రూపాయలు!

వీళ్ళకు కఠినాతి కఠినమైన శిక్ష విధించ వలసినదిగా కోరుతున్నాను.

ఆ తరువాత పోలీసువాళ్లు కృష్ణకాంత చక్రవర్తి అనే సాక్షిని ప్రవేశ పెట్టారు. అతను ఇలా చెప్పాడు:

"సార్! నేను హుగ్లీ నివాసిని. నేను స్టేట్ ట్రాన్స్‌పోర్టు హౌరా డిపోలో పని చేస్తున్నాను. నేను చేసే అఫీసులోనే శాంతి రంజన్ డే కూడా పనిచేస్తున్నాడు. అతనిని నేను ఆరేడు సంవత్సరాలుగా ఎరుగుదును. నేను టి. బి. పేషెంటుని. పందొమ్మిదివందల డెబ్భై ఆరు జూన్ 8వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకి శ్రీరాంపురం లోని ఆస్పత్రికి చికిత్సకోసం వెళ్ళాను. అక్కడ శ్రీరాంపురం స్టేషన్‌లో శాంతిరంజన్‌డే ఒక పాన్ దుకాణం దగ్గర నిల్చుని వున్నాడు. అతన్ని అక్కడికి ఎందుకు వచ్చావని ప్రశ్నించాను. అతను నన్ను కొంచెం పక్కకి తీసుకెళ్ళి తను తన పక్కింటి అమ్మాయిని ప్రేమించాననీ, ఆ అమ్మాయికి గర్భం వచ్చిందనీ, ఆ పిల్ల తల్లిదండ్రులికి తెలియకుండా ఎబార్షన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పాడు. ఆ విషయం విన్నప్పుడు నేను చాలా బాధపడ్డాను. అలాంటి పని చెయ్యవద్దని, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోమని చెప్పాను. పెళ్ళి చేసుకోడానికి వున్న ఇబ్బందులను ఏకరువు పెట్టసాగాడు. అతని మాటలు వినాలనిపించక నేను వెంటనే హాస్పిటల్‌కి వెళ్ళిపోయాను. ఆ తరువాత ఒక రోజున నాదగ్గరకి వచ్చి, వచ్చే ఆదివారం అంటే జూన్ 13న 54వ నెంబరు బస్టాండు దగ్గర తనని కలుసుకోమని కోరాడు. ఆ రోజు ఆ బస్టాండులో మూడు గంటలకి ఒక 14, 15 ఏళ్ళ పిల్లని వెంట బెట్టుకుని వచ్చాడు డే.

ఆ అమ్మాయి గౌను వేసుకుని వుంది. ఆ అమ్మాయి పేరు

"గౌరీ జయధర్" అనీ, తామిద్దరూ షికారుకు బయల్దేరామనీ చెప్పాడు. అందరం కలిసి అరవింద మార్కెట్ దగ్గరికి వెళ్ళాం. అరవింద మార్కెట్ మొదటి అంతస్తులో ఉన్న ఒక క్లినిక్ దగ్గరికి తీసుకెళ్ళాడు. నన్ను బయటనే ఉండమని డే క్లినిక్ లోపలికి వెళ్ళాడు. ఒక గంట తర్వాత అతనొక్కడే బయటకు వచ్చాడు. ఆ పిల్ల గురించి అడగ్గా, అబార్షన్‌కోసం డాక్టర్ ముఖర్జీ ఆరోజుకి క్లినిక్‌లోనే వుంచమన్నాడనీ, అందుకోసం రెండు వందల రూపాయలు ఇమ్మన్నాడనీ, తన దగ్గరున్న నూట అరవై ప్రస్తుతానికి ఇచ్చానని చెప్పాడు. అతని మాటలు విన్న నేను అవాక్కయి నిలబడిపోయాను. మరోమాట మాట్లాడకుండా ఇంటికి వెళ్లిపోయాను. 16వ తేదీ దాదాపు నాలుగు గంటల ప్రాంతంలో గౌరి అనే అమ్మాయి చనిపోయినట్లు విన్నాను. ఆ పిల్ల మా ఆఫీసులో పనిచేసే గోపాల్ జయధర్ పెద్ద కూతురని కూడా అప్పుడే తెలిసింది. అదే సాయంత్రం పోలీసులు ఎంక్వయిరీ చేస్తే ఇవే విషయాలను చెప్పాను."

అతని సాక్ష్యం ముగియగానే కోర్టులో గుసగుసలు బయల్దేరాయి. ముద్దాయిల తరఫున వాదిస్తున్న సనాతన ముఖర్జీ లేచాడు. నల్లగౌను సర్దుకున్నాడు. జేబులో నుంచి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకున్నాడు. చక్రవర్తి ముందుకొచ్చాడు.

"నిజంగా మీరు డే తో అరవింద మార్కెట్‌కి వెళ్ళారా? అక్కడ "గౌరి" అనే అమ్మాయిని డే క్లినిక్‌లో చేర్పించారా"? అనడిగాడు.

''అవును! ఇదేమాటను ఎన్నిసార్లు చెప్పిస్తారు?'' విసుక్కున్నాడు చక్రవర్తి.

''ఇంతకు ముందు ఆ క్లినిక్‌కు మీరెప్పుడైనా వెళ్ళారా?"

''వెళ్ళలేదు!''

'' అంటే డాక్టర్ బెనర్జీని మీరిదివరకు చూడలేదన్నమాటేగా''

''అవును.''

"మీరు క్లినిక్ బయటనే నిల్చున్నానని చెప్పారు! అంటే క్లినిక్‌లో వున్న డాక్టరెవరో మీకు తెలియదన్నమాటేకదా!"

సాక్షి తడబడ్డాడు.

ముఖర్జీ గొంతు పెద్దది చేస్తూ,

"మిస్టర్ చక్రవర్తీ! మీరు నా ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేదు. కోర్టును తప్పు త్రోవ పట్టిస్తున్నారు."

''ఆ డాక్టర్ని నేను చూడలేదు! నాకు తెలీదు. అతని పేరు డే చెప్పడం వల్లనే తెలిసింది"

ముఖర్జీ అతన్ని మరో ప్రశ్న వేయలేదు. అతడు బెనర్జీ తరఫున వాదిస్తున్నాడు.

ఆ తరువాత అరవింద మార్కెట్ కాపలాదారును బోనులో ఎక్కించారు. కాపలాదారు ఇలా చెప్పాడు. ''అయ్యా! రోజూ లాగానే పదమూడు జూన్‌న అరవింద మార్కెట్ మెయిన్ గేటుకు తాళం వేశాను. దాదాపు రాత్రి ఒంటి గంట ప్రాంతంలో డాక్టర్ బెనర్జీ వచ్చి నన్ను నిద్ర లేపి గేటుతీయమని అడిగాడు.

నేను ఎందుకనడిగాను.

అందుకు సమాధానంగా, తన పేషెంటొకామె ప్రమాద పరిస్థితిలో వుందని, అంబ్యులెన్స్‌కి ఫోన్ చెయ్యాలనీ చెప్పాడు. నేను

వెంటనే గేటు తెరిచాను. గేటు పక్కనే కునికిపాట్లు పడుతూ కూర్చున్నాను. ఒక అర్ధగంట తరువాత అంబ్యులెన్స్ లోపలికొచ్చింది. డాక్టరు, నర్సు, ఒక పదిహేను,పదహారేళ్ళమ్మాయిని అంబ్యులెన్స్‌లో పడుకోపెట్టి వాళ్ళూ కూర్చున్నారు. నేను ఈ విషయాన్నే పోలీసులకి చెప్పాను'' అని ముగించాడు.

ముఖర్జీ సాక్షి ముందుకొచ్చి నిలబడ్డాడు.

"మిస్టర్ సయ్యద్! నీవు నిద్రలో వుండగా బెనర్జీ లేపాడన్నావు. అప్పుడు గాఢ నిద్రలో వున్నావా?''

''అర్ధరాత్రి గాఢ నిద్రలో వున్న నిన్ను లేపడంవల్ల నీకు పూర్తిగా మత్తు వదల్లేదు కదూ!''

''అవును! మనసులో డాక్టరుని తిట్టుకున్నాను కూడా!''

"మళ్ళీ నిద్రపోయే ప్రయత్నంలో గబగబా గేటు తీసేసి వుంటావు''

''అవును!''

''అంటే నువ్వు నిద్రమత్తులో నిన్ను తలుపు తీయమని అడిగినది డాక్టర్ బెనర్జీయో కాదో సరిగ్గా చూడలేదన్నమాట?"

సయ్యద్ బిత్తరపోయాడు.

ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థంకాలేదు.

అంతలోనే ముఖర్జీ చిరునవ్వుతో "దట్ ఈజ్ ఆల్ యువరానర్" అంటూ కూర్చున్నాడు.

కోర్టులో డాక్టర్ శ్యామ్ బెనర్జీని ప్రవేశపెట్టారు.

"రాత్రి ఒంటిగంటకు ఒక వ్యక్తి గాభరాగా తన దగ్గరకొచ్చి అంబ్యులెన్స్ కోసం ఫోన్ చేసుకొన్నాడని, కొంచెం సేపటికి అంబ్యులెన్స్ తన క్లినిక్‌లోకే వచ్చిందని, అందులో డాక్టర్ బెనర్జీ వెళ్ళిపోయాడని" చెప్పాడు. తనకంతకు ముందు బెనర్జీ తెలియదని చెప్పాడు.

సనాతన ముఖర్జీ శ్యాంబెనర్జీని ఒకే ప్రశ్న వేశాడు. 'నువ్విప్పుడు చూడగానే అతన్ని గుర్తించగలవా?'

దానికి సమాధానంగా "నా క్లినిక్‌కి రోజూ ఎంతోమంది వస్తూ పోతూ వుంటారు. ఫోన్ కోసం వచ్చిన వాళ్ళని ప్రత్యేకంగా చూడ వలసిన అవసరంలేదు. అందుచేత ఆవ్యక్తిని గుర్తించగలననిచెప్పలేను!" అన్నాడు. ముఖర్జీ ముఖంలో విజయ గర్వంతో కూడిన చిరునవ్వు కనిపించింది.

"యువరానర్, ఇలాంటి సందేహాస్పదమైన సాక్ష్యాలను ఆధారంగా తీసుకోవటం న్యాయం కాదు!'' అంటూ కూర్చున్నాడు.

రెండో రోజుకి వాయిదా పడింది.

* * *

రెండవరోజు బోనులోకి పోలీసులు అరవింద మార్కెట్లో బనియన్ల దుకాణదారు గగన చక్రవర్తిని సాక్షిగా నిలబెట్టారు.

"సార్! జూన్ 13 సాయంకాలం ఇద్దరు వ్యక్తులు ఒక అమ్మాయిని తీసుకొచ్చారు. ఆ అమ్మాయి గౌను తొడుక్కొని వుంది. ఒక వ్యక్తి బయట నుంచున్నాడు. మరో వ్యక్తి ఆ అమ్మాయిని క్లినిక్‌లోకి తీసుకెళ్ళాడు'' అంటూ మొదలుపెట్టి, ఆ అమ్మాయిని అంబ్యులెన్స్‌లో తీసుకెళ్ళేవరకూ కథగా చెప్పాడు.

సనాతన ముఖర్జీ నల్లగౌను సరిచేసుకుంటూ చక్రవర్తి దగ్గర కొచ్చాడు.

''నువ్వు బనియన్ల వ్యాపారం చేస్తావా? లేక వచ్చేపోయేవారిని చూస్తుంటావా?" అనడిగాడు.

అతను గాభరాపడుతూ "బనియన్లు వ్యాపారమే చేస్తాను!'' అన్నాడు.

"అయితే మరి 13 జూన్ నుంచి 14 జూన్ దాకా జరిగిన విషయాలన్నీ ఎలా చెప్పగలిగావ్? కొనటానికి వచ్చిన వాళ్లకు బనియన్లమ్ముతావా లేదా?''

''సర్! సర్! యాదృచ్ఛికంగా నేను ఆ సంఘటన చూడటం జరిగింది.''

''అబద్ధం! నువ్వు పోలీసు వాళ్లకి తప్పుడు సాక్ష్యం చెప్పావు. ఒక డాక్టరు క్లినిక్ వుందంటే ఎంతోమంది వస్తూ పోతుంటారు. ఆరోజు క్లినిక్‌లోకి వెళ్లినవాడు గంట తరువాత ఆపిల్లను బయటికి తీసుకొచ్చాడని చెప్పావు. గంటసేపూ వ్యాపారం మానేశావా? అదే కాదు! పధ్నాలుగో తేదీన అదే వ్యక్తి ఒంటరిగా క్లినిక్‌కి వచ్చాడన్నావు. అంటే 13వ తేదీ నుంచి పధ్నాలుగో తేదీ వరకూ ఆ క్లినిక్ కేసి చూస్తూ కూర్చున్నావన్న మాట. నీకు ఆ క్లినిక్ అంటే అంత శ్రద్ధ ఉండడానికి కారణం ఏమిటి?"

గగన చక్రవర్తి గాభరా పడ్డాడు. సమాధానం చెప్పలేకపోయాడు.

"దట్ ఈజ్ ఆల్ యువరానర్! ఈ సాక్షి చెప్పినదంతా కట్టుకథ" అని వెళ్లి కూర్చున్నాడు.

ఆ తరువాత మున్సిపాలిటీ టెలిఫోన్ ఆపరేటర్ని కూడా విచారించడం జరిగింది.

సనాతన ముఖర్జీ అతన్ని కూడా తికమక పెట్టేశాడు.

అంబ్యులెన్స్ పంపించిన డాక్టరు వగైరా అందర్నీ క్రాస్ఎక్జామిన్ చేశాక గౌరి తండ్రి గోపాల్ జయధర్‌ని బోనులోకి ఎక్కించారు.

అతను ఏడుస్తూ ఈ క్రింది కథ చెప్పాడు-

''సార్! నేను 1958 నుంచి హౌరా స్టేట్ బస్ డిపోలో పని చేస్తున్నాను. 1956లో నా వివాహం జరిగింది. నా భార్య పేరు ఉషారాణి. 1960 అక్టోబర్లో గౌరి పుట్టింది.

''శాంతిరంజన్ డే'' మా డిపార్టుమెంట్‌లోనే పనిచేస్తున్నాడు. మా ఇంటి దగ్గర్లోనే ఉంటున్నాడు. అతను పన్నెండు జూన్ 1976లో శాంతిరంజన్ డే నేను లేనప్పుడు నాభార్యతో-తన తల్లికి ఒంట్లో బాగా లేదనీ, రెండు రోజులు గౌరిని తన ఇంటికి పంపమని అడిగాడు. అంతకు ముందు కూడా గౌరి అప్పుడప్పుడు వాళ్లింట్లో ఉంటుండేది. అందువల్ల నేనేమీ అభ్యంతరం చెప్పలేదు.

పదిహేనో తేదీన గౌరిని తీసుకురమ్మని నా చిన్నకూతురు ఉషను పంపించాను.

ఉష తిరిగివచ్చి "నాన్నా! అక్కయ్యకి కడుపు నొప్పిగా ఉంటే బాబాయ్ హాస్పటల్‌కి పంపించాడట" అన్నది.

నేను గాభరాగా పోలీస్ స్టేషనుకి పరిగెత్తాను.

అక్కడ తెలిసింది - నాబిడ్డ చనిపోయిందని, హాస్పిటల్‌లో వుందని, అరెస్ట్ చేసింది శాంతిరంజన్ డే ను, మరో డాక్టర్ని అని.

స్నేహం పేరుతో ఇంత ద్రోహం చేశాడు" అంటూ నిండుకుండ బ్రద్దలయినట్లు ఒక్కసారి భోరున ఏడ్చాడు.

కోర్టులో అందరి కళ్ళు చెమ్మగిల్లాయి.

జడ్జి కేసును వాయిదా వేసి లేచాడు.

* * *

మూడో రోజున కూడా పోలీసు ఇన్‌స్పెక్టర్లు వగైరా సాక్షులను సనాతన ముఖర్జీ తన ప్రశ్నలతో తికమక పెట్టాడు.

అశ్చర్యం ఏమంటే గౌరి తండ్రిని మాత్రం ఏమీ ప్రశ్నించ లేదు.

వాద ప్రతివాదనలను విన్న తరువాత న్యాయమూర్తి ఇలా తీర్పు ఇచ్చారు. "నాకెంతో బాధగా ఉంది! న్యాయ శాస్త్ర నియమాల పరిధికి కట్టుబడి - పదిహేను సంవత్సరాల పసిదాని జీవితాన్ని బలిగొన్న దుర్మార్గులను నిర్దోషులుగా చెప్పక తప్పలేదు. సాక్షుల అస్పష్ట సాక్ష్యాల వలన బెనిఫిట్ ఆఫ్ డౌట్ సెక్షన్ 314, 120, మరియు 109 క్రింద వాళ్లను నిర్దోషులుగా విడుదల చేస్తున్నాను.

న్యాయ సూత్రాల బంధాలలో వున్న నేను ఈ దోషుల్ని నిర్దోషులుగా విడుదల చేస్తున్నందుకు బాధపడుతున్నాను" అని సనాతన ముఖర్జీ వైపుకి తిరిగి "ముఖర్జీబాబూ! వకీలుగా నీశక్తి సామర్థ్యాలను మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నాను" అని అన్నారు.

''యువరానర్! గౌరీ జయధర్‌లాంటి అమాయకపు బాలిక కొందరు రాక్షసుల వలన దారుణంగా చనిపోవటం నాకూ ఎంతో బాధని కలిగించింది. మానవత్వానికి సిగ్గు కల్గించే సంఘటన ఇది అని నాకు తెలుసు. కానీ నేను వృత్తిరీత్యా న్యాయవాదిని. నాక్లయింట్సును రక్షించడం నా కర్తవ్యం. తన కర్తవ్యాన్ని పాటించడం ప్రతి వ్యక్తి ధర్మం....'' అంతవరకూ చెప్పి గొంతుకు ఏదో అడ్డుపడినట్లు కళ్ళు తుడుచుకుంటూ ఆగిపోయాడు సనాతన ముఖర్జీ.